క్లుప్తంగా

బుద్ధపౌర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

వాంకిడి: ఈ నెల 23న బుద్ధ పౌర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అంబేద్కర్ యువజన సంఘాలు, సిద్ధార్థ యువజన సంఘాలు, రమాబాయి మహిళా మండలి సంఘ సభ్యులు, బౌద్ధ బాంధవులు పెద్ద ఎత్తున ముందుకొచ్చి వేడుకలను పవిత్రంగా నిర్వహించాలని కోరారు. బౌద్ధ విహారాలు, అంబేద్కర్ కూడలీల వద్ద పంచశీల, నీలి జెండాలతో ముస్తాబు చేయాలని, సాయంత్రం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బౌద్ధ సంఘం నాయకులు ఉప్రె వినేష్, ఇస్తారి, తిరుపతి, టీమాజీ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

పెంచికల్‌పేట్: జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అభిమానులు కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భాస్కర్, అంజన్న, శ్రీకర్, కాంతారావు, సాయి, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత



దేశీదారును పట్టుకున్న అధికారులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని సుభాష్ కాలనీలో సోమవారం దేశీదారు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ అబ్కారీ శాఖ సీఐ రవి తెలిపారు. సుభాష్‌కాలనీలో కె. విష్ణు దేశీదారు మద్యం అమ్ముతుండగా దాడి చేసి 90 మి.లీల 50 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దేశీదారు విక్రయిస్తున్న విష్ణుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

నార్నూర్: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రమేశ్, తహసీల్దార్ రాజలింగు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. రైతులవేదికలలో ప్రతీ మంగళవారం, శుక్రవారం రైతులకు వానాకాలం సాగుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎరువుల దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా రశీదులు తీసుకోవాలన్నారు.

కరకట్ట నిర్మాణం చేపట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గోదావరి తీరం వెంబడి కరకట్ట నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హాజీపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌తో పాటు, ర్యాలీవాగు పోటెత్తడంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలతో పాటు హాజీపూర్ మండలం గోదావరి తీరం వైపు ఉన్న వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లోని ఇళ్లు, వ్యవసాయ భూములు నీటి మునిగి భారీగా నష్టపోతున్నారన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపు లేకుండా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కారణంగానే గోదావరి తీరం వెంబడి ఉన్న ఇళ్లు నీట మునిగి భారీ ఆస్తి నష్టం వాటిల్లుతోందన్నారు. మంచిర్యాల, వేంపల్లి, ముల్కల్ల గ్రామాల ప్రజలకు ముంపు నుంచి విముక్తి జరగాలంటే నిపుణుల పర్యవేక్షణలో కరకట్ట నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయాలి

తలమడుగు: మండల కేంద్రంలోని మహిళ సమైక్య (స్త్రీ శక్తి) భవన సమావేశ భవనంలో నుంచి తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయాలని మండల సమైక్య మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. 2019 సంవత్సరంలో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉండడంతో తహసీల్దార్ కార్యాలయానికి మండల సమైక్య భవనంలో రెండు గదులను ఇవ్వడం జరిగిందన్నారు. ఆరు సంవత్సరాలు గడిస్తున్నా.. తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టలేదు. నూతన భవన నిర్మించలేదు. మండల సమైక్యలో 28 గ్రామాల సంఘాలు ఉన్నాయి. 690 స్వయం సహాయక సంఘాలు, 7442 సంఘాల సభ్యులు ఉన్నారు. ప్రతినెల సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నామని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యాలయాన్ని ఖాళీ చేయాలని విన్నవించారు.

అలసిన దేహానికో టీ



- రుచితో పాటు ఉత్తేజాన్నిచ్చే పానీయం
- గ్రామీణ ప్రాంతాల్లోనూ వెలుస్తున్న టీ హబ్స్
- నేడు అంతర్జాతీయ 'టీ' డే

కౌటాల: పొద్దునే టీ.. సాయంత్రమో టీ.. దోస్తులతో టీ.. చుట్టాలతో టీ.. పని ఆపి ఒక టీ.. పనయ్యాకో టీ.. తాగాల్సిందే టీ అంటూ టీ ప్రియులు చెబుతున్నారు. చెమటలు కక్కే వేడిలోనూ పొగలుకక్కే చాయ్ తాగుతున్నారు. చాయ్ కలిగించే కిక్కులను పేద, ధనిక వ్యత్యాసం లేకుండా ఆస్వాదిస్తుంటారు. ఎంత పేదలైనా ఇంటికి వెళ్లామంటే.. ఓ గ్లాసు మంచినీళ్లు, ఓ కప్పు టీ ఇవ్వాల్సిందే. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలకు టీ అత్యంత ఇష్టమైన పానీయం. అలాంటి టీకి ఒక రోజు ఉంది. 2005 నుంచి ఏటా మే 21న అంతర్జాతీయ 'టీ' దినోత్సవం నిర్వహిస్తున్నారు.

1793 నుంచే..

అలిసిన మనసుకు, దేహానికి ఉత్తేజాన్ని ఇచ్చే పానీయం టీ. అరె భాయ్ చటుక్కున తాగరా చాయ్.. అంటూ ఓ సినీగేయ రచయిత టీ గొప్పతనాన్ని వర్ణిస్తూ పాట రాశాడు. ఎంతో చరిత్ర కలిగిన టీని తేనీరు, చాయ్ అని పిలుస్తారు. 15వ శతాబ్దంలో నాగరిక ప్రపంచానికి టీ పరిచయమైంది. మొట్టమొదటగా మన దేశంలో 1793లో కలకత్తాలోని బొటానికల్ గార్డెన్‌లో లార్డ్ మెకార్టి టీ మొక్కలు పెంచడం ప్రారంభించాడు. ఇప్పుడు ఇంటింటికీ టీ చేరింది. ప్రపంచ టీ ఉత్పత్తిలో చైనా తర్వాతి స్థానం భారత్‌దే. అంతర్జాతీయంగా 30శాతం టీ పొడిని ఒక్క భారతీయులే వినియోగిస్తున్నారు.

సహజమైన పానీయం..

టీ సహజమైన పానీయం. ఇంటికి ఎవరు వచ్చినా అతిథి మర్యాదలో మొదట చేరిపోయేది 'టీ'. స్నేహితులు కాలక్షేపానికి టీ పాయింట్‌కు చేరాల్సిందే. సమావేశాల్లోనూ తేనీటిది ప్రత్యేక స్థానం. ప్రస్తుతం బయట రకరకాల కేఫ్‌లు వెలుస్తున్నాయి. టీలలో కూడా చాలా రకాలు తయారు చేస్తున్నారు. అల్లం టీ, లెమన్ టీ, బ్లాక్ టీ, గ్రీన్ టీ, మసాలా టీ, కరోనా టీ రకరకాల టీలను టీ ప్రియులు ఆస్వాదిస్తున్నారు. మండల కేంద్రాల్లో సైతం ప్రస్తుతం వివిధ కంపెనీలు వివిధ పేర్లతో టీ పాయింట్‌లు ఏర్పాటు చేసి ఒక కప్పు చాయ్‌కు రూ.10లకు తగ్గకుండా విక్రయిస్తున్నారు. కానీ పలువురు టీ వ్యాపారులు ఇప్పటికీ రూ.5లకే టీ విక్రయిస్తున్నారు.

టీతోనే రోజు మొదలు



ప్రతీరోజు ఉదయం చాయ్ తాగుతూ న్యూస్ పేపర్ చదవడం నాకు అలవాటు. సమావేశాలు, సభలకు వెళ్లిన ప్రతీచోట టీ తప్పనిసరిగా ఇస్తున్నారు. రోజుకు రెండు, మూడు సార్లు టీ తాగుతాను.

– కోనస్‌కార్ అనిల్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతీరోజు మూడు..



పనుల నిమిత్తం చాలా ప్రదేశాలు తిరుగుతుంటాను. దీంతో కొన్నిసార్లు తలనొప్పిగా ఉంటుంది. ఆ సమయంలో నాకు వెంటనే గుర్తొచ్చేది చాయ్. టీ తాగిన వెంటనే మరింత ఉత్సాహంతో పనిలో పడిపోతాను. ప్రతీరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు సార్లు తప్పనిసరిగా టీ తాగుతాను.

– టిల్లుభాయ్, కాగజ్‌నగర్

ఉదయం నుంచి రాత్రి దాకా..



ప్రతీరోజు ఉదయం నాలుగు గంటలకే టీ స్టాల్ తీస్తాను. ఉదయం నుంచి రాత్రి వరకు వందలాది మంది వచ్చి టీ తాగుతుంటారు. ఏ చిన్న పని మీద వచ్చినా టీ తాగడానికి ఇక్కడికి వస్తుంటారు. బ్లాక్, లెమన్, అల్లం, గ్రీన్ టీలు చేస్తుంటాను. 15 ఏళ్లుగా టీ స్టాల్ నడుపుతున్నాను.

– మల్లన్న, టీ స్టాల్ వ్యాపారి, కౌటాల

లోలెవల్ వంతెన పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఈ నిరంజన్ రావు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎర్రగుట్ట వద్ద ఉచ్చమల్లవాగుపై నిర్మిస్తున్న లోలెవల్ వంతెన నిర్మాణ పనులను సోమవారం ఐటీడీఏ డీఈ నిరంజన్‌రావు పరిశీలించారు. వంతెన నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. వంతెన నిర్మాణంలో పాటిసున్న నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గుత్తేదారుకు సూచించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

లింగాపూర్: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వంజారిగూడ, లింగాపూర్, మామిడిపల్లి, పిక్లాతండా గ్రామాల్లో కోత దశలో ఉన్న జొన్న పంట నేలకొరగ్గా సాక్షిలో 'గాలివానకు దెబ్బతిన్న పంటలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఏఈవో తోడసం శ్రీనివాస్ పంటలను పరిశీలించి దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కార్మికులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న మణిరాం సింగ్

రెబ్బెన: సింగరేణి వ్యాప్తంగా గ్రాట్యుటీ చెల్లింపుల్లో అన్యాయానికి గురైన రిటైర్డ్ కార్మికులకు ఏరియర్స్ చెల్లించి న్యాయం చేయాలని టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోల్ ఇండియాలో గ్రాట్యుటీ చట్టాలను 2018, మార్చి 28న గ్రాట్యుటీని రూ.10లక్షల నుంచి రూ. 20లక్షలకు పెంచుతూ పార్లమెంట్‌లో ఆమోదించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2016 నుంచి అమలు చేసి బొగ్గు గని కార్మికులకు మాత్రం 2018 నుంచి అమలు చేయటంతో ఆ మధ్య కాలంలో రిటైర్డ్ అయిన కార్మికులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 3816 మంది కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. ఉపాధ్యక్షుడు నారాయణ, ఏరియా నాయకులు చంద్రమౌళి, వెంకటస్వామి, పాషా, నాయకులు జీవరత్నం, గంగయ్య, యాదగిరి, హసన్, సదానందం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం



లింగాపూర్: మండలంలోని దంపూర్ గ్రామపంచాయతీ పరిధి రాగాపూర్(కే) గ్రామంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దీంతో గ్రామంలోని గిరిజన విద్యార్థులు చదువులకు దూరంగా ఉంటున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాగుకు సమాయత్తం

- మండలంలో 22,600 ఎకరాల్లో సాగు అంచనా
- వ్యవసాయ పనుల్లో బిజీగా మారిన రైతులు



దుక్కి దున్ని సిద్ధంగా ఉంచిన భూమి

తిర్యాణి: మండలంలో వర్షాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వాతావరణం చల్లబడటంతో పాటు కొంతమేర వర్షాలు పడటంతో దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులను పొలాల్లో చల్లడం వంటి పనుల్లో రైతులు బిజీగా గడుపుతున్నారు. మండలంలో ఎక్కువగా వర్షాధారిత పంటల సాగు ఎక్కువగా జరుగుతుండగా ఇప్పటికే రైతులు ఏ పంటలు సాగు చేస్తారు.. ఎంతమేర విత్తనాలు, ఎరువులు అవసరమవుతాయి.. తదితర అంశాలతో ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సాగు ప్రణాళికలు సిద్ధం చేశారు.

22,600 ఎకరాల్లో సాగు అంచనా..

ఈ సంవత్సరం వర్షాకాలం పంటల సాగుకు సంబంధించి 22,600 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. అందులో ప్రతీ ఏడాది మాదిరిగానే అధికంగా పత్తి పంటను 18,179 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉండగా, 1,623 ఎకరాల్లో వరి, 2,119 ఎకరాల్లో కందులు, 500 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా జూన్ 8 తర్వాత వచ్చే మృగశిర కార్తె తర్వాత వానలు కురుస్తాయని రైతులు నమ్మకంగా ఉన్నారు. దీంతో పాటు ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో ఇప్పటికే మండల వ్యాప్తంగా ఉన్న రైతులు వేసవి దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉంచుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి చేరడం ద్వారా భూమి సారవంతంగా మారుతుంది. వీటితో పాటు వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంటల దిగుబడితో పాటు తేమ శాతం పెరుగుతుంది. ఈ మేరకు రైతులు భూసారం పెరిగేలా వేసవి దుక్కుల పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. మరోవైపు విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం ఫర్టిలైజర్ షాపుల్లో క్యూ కడుతున్నారు. కాగా విత్తనాల ఎంపిక, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

వర్షాకాలం పంటల సాగుకు సంబంధించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వర్షాలు కురిసిన తరువాతనే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నా సమయంలో విత్తనాలు విత్తితే వేడికి మొలకెత్తే శాతం తక్కువగా ఉంటుంది. విత్తనాలను విత్తుకునే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– తిరుమలేశ్వర్, మండల వ్యవసాయ శాఖ అధికారి

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి



అనుకోడలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చింతలమానెపల్లి: గ్రామాలలో ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుడ్లబోరి పల్లె దవాఖాన వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలాజీఅనుకోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 50 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలోని 30 మంది నుంచి రక్త పరీక్షలు సేకరించినట్లు సిబ్బంది తెలిపారు. వైద్యాధికారి రాజ్‌కుమార్ జ్వర బాధితులకు పలు సూచనలు చేశామన్నారు. జ్వరంతో బాధపడేవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. సూపర్‌వైజర్ ఇందిరా గాంధీ, ఏఎన్ఎంలు రోసియా, ఆశ వర్కర్లు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



కనుకక్క (ఫైల్)

కౌటాల: మండంలోని శీర్షా గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ కడారి కనుకక్క(65) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2019లో శీర్షా గ్రామం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంతో సర్పంచ్ ఎన్నికల్లో కడారి కనుకక్క ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదేళ్ల పాటు గ్రామస్తులకు సర్పంచ్‌గా సేవలు అందించారు. గత కొద్ది రోజుల నుంచి కనుకక్క అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం గ్రామంలోని ఆమె ఇంటి వద్ద మృతి చెందగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. అనంతరం అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. కనుకక్కకు కుమారుడు భీమయ్య ఉన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాల, క్లారిటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు గోవా ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు సోమవారం ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు సఫల్య, డామినిక్ తెలిపారు. విద్యార్థులు భవిజ్ఞ, నవనీత్ చంద్ర, త్రినాథ్, అశ్విత్ యాదవ్, భవిత్ రెడ్డి, వివేక్ తేజ, క్రిస్ కుమార్‌లు ప్రతిభ కనబర్చారన్నారు. విద్యార్థులకు సినీ నటుడు సుమన్ బహుమతులు ప్రదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ దేవయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

తునికాకుతో ఉపాధి



తునికాకు పేరుస్తున్న ఓ కుటుంబం

దహెగాం: వేసవిలో తునికాకు సేకరణ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి పొందుతున్నారు. మండలంలోని గిరవెల్లి యూనిట్‌లో తునికాకు సేకరణ ఈనెల 14న ప్రారంభించారు. మూడు రోజుల పాటు సేకరించిన అనంతరం తునికాకు లేతగా, సరిగా లేనందున మూడు రోజుల పాటు సేకరణ నిలిపి వేశారు. సోమవారం నుంచి మళ్లీ సేకరణ ప్రారంభమైందని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రీధర్‌చారి తెలిపారు. మండలంలోని గిరవెల్లి యూనిట్‌లో సుమారు 14 కల్లాలు ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం 52 లక్షల కట్టల లక్ష్యం పెట్టుకున్నామని పేర్కొన్నారు. తునికాకు సేకరణ కోసం వెళ్లే ప్రజలు అడవిలో లోపలికి వెళ్లకూడదన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన తునికాకు సేకరించాలన్నారు.

నేడు సీజ్ చేసిన ఇసుక వేలం

రెబ్బెన: మండలం నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసిన ఇసుకను మంగళవారం వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. గత మార్చి 3వ తేదీన అర్ధరాత్రి రెండు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం పట్టుకున్న లారీలను విడుదల చేయగా, సుమారు 21 క్యూబిక్ మీటర్ల ఇసుకను రెబ్బెన పోలీస్ స్టేషన్ వద్ద నిల్వ చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఇసుకను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు



జామిని వద్ద ఎమ్మెల్యే హరీశ్‌బాబును అడ్డుకుంటున్న పోలీసులు

జైనూర్: ఇటీవల జరిగిన ఘర్షణల్లో గాయపడిన ఆదివాసీ యువకుడిని, వడ్డెర కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును సోమవారం మండల పోలీసులు మండలంలోని జామిని గ్రామం వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ గాయపడిన వారిని పరామర్శించేందుకు సైతం వెళ్లనీయకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. గాయపడిన వారికి సరైన వైద్య సేవలందించడంతో పాటు దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, కోశాధికారి అరుణ్‌లోయ, తదితరులు ఉన్నారు. అలాగే వడ్డెర కులస్తులను పరామర్శించేందుకు వెళ్తున్న వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్యను సంఘం సభ్యులను ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద అడ్డుకున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ పత్రిక జర్నలిస్ట్‌పై సోమవారం దాడులు చేసిన మైనింగ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాగజ్‌నగర్‌లోని జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం రహదారి సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తున్న వారి ఫొటోలు తీసిన జర్నలిస్ట్ తిరుపతిపై మైనింగ్ నిర్వాహకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే మైనింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.